# అమెరికా నుంచి అమూల్య

- *మంథా భానుమతి*

తెల్లారకుండానే తెలివొచ్చేసింది. కానీ లేచి ఏం చేయ్యాలిలే అని అలాగే పడుక్కున్నాను. తలుపు చప్పుడు విని కూడా బద్ధకంగా ప్రక్కకి తిరిగిపోయాను. ఇంత పొద్దున్నే ఎవరయ్యుంటారూ? ఐనా పాలవాడైతే బెల్లు కొడ్తాడు కదా! ఇంక తప్పదనుకున్నారేమో బావ లేచి వెళ్ళారు. పెళ్ళి చేసుకున్నాక నా మూడ్స్‌కి అలవాటు పడక తప్పుతుందా!



బావ వెళ్ళేలోగానే పది సార్లు తలుపు చప్పుడు, ఆరు సార్లు ఆపకుండా బెల్లూ.

"సీతా ఎవరొచ్చారో చూడూ". బావ కేక! వింటుంటే మనసులో ఏదో ఉల్లాసం. ఆకాశంలో ఎగురుతున్న అనుభూతి.చటుక్కున మంచం దిగి తొందరగా అడుగు వెయ్యబోయాను. కుడి మోకాలు కలుక్కుమంది. మనస్సుని కిందికి దింపి నెమ్మదిగా అడుగులు వేశాను.

ఉగాది కదా! వాచ్‌మన్ వేప్పువ్వూ మామిడాకులూ తెచ్చుంటాడు. అంతకంటే పండుగపూట ఎవరొస్తారూ! కాళ్ళీడ్చుకుంటూ హాల్లోకి వెళ్తూండగానే కాళ్ళకడ్డంపడి బుజ్జి గాడు. "హాయ్ గ్రాండ్‌మా!" అంటూ ఆర్తిగా పట్టేసు కున్నాడు. వాడి వెనుకే అమూల్య చెయ్యి పట్టుకుని బుడిబుడి అడుగులు వేస్తూ పాప.

చేతిలో బాగ్ కింద పడేసి అమూల్య వచ్చి గట్టిగా కౌగలించుకుంది. ప్రశాంత్ అప్పుడే సూట్‌కేసులు దొర్లించుకుంటూ వస్తునాడు.

నాకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. రెండేళ్ళయింది చూసి.

ఇప్పటికీ గుండెల్లో సన్నగా నొప్పి.. అప్పుడు వరుసగా జరిగిన సంఘటనలు తల్చుకుంటే.

...........

"అమ్మా పాప అచ్చు మీ లాగే ఉంది కదూ!" పాపకి స్నానం చేయించి బట్టలు వేస్తున్న అమూల్యని ముఛిపెంగా చూశాను.

మూడు తరాల తర్వాత ఇంట్లో ఆడపిల్ల. అందరికీ ముచ్చటగా ఉంది. బుజ్జిక్కూడా నాలుగేళ్ళు నిండాయి. వాడి సంబరం చూడాల్సిందే. అమూల్య కూడా ఇంట్లోనే ఉంటోంది. నా పని పిల్లల్ని ఆడించడం. ఏవైనా చిన్న చిన్న పనులు చేయడం, వాకింగ్, ఎప్పుడో మూలపడేసిన పైంటింగ్, అప్పుడప్పుడు ఎవరింటికేనా వెళ్ళడం, పుస్తకాలు చదువుకోడం. బావ కూడ తన వ్యాపకాలతో విసుగు లేకుండా గడిపేస్తున్నారు.

ఎంతో ఆనందంగా నడుస్తున్న సంసారంలో అనుకోని అవాంతరం వచ్చి పడింది.. రెండు రూపాల్లో!

ఎప్పుడూ తలనొప్పి అని కూడా అనని బావకి స్ట్రోక్ వచ్చింది. బైపాస్ చేశారు. పల్లెలో పొలాల్లో తిరిగిన మనిషి కనుక తొందరగానే కోలుకున్నారు. క్రమం తప్పకుండా మందులు వ్యాయామం, తేలికైన ఆహారం తీసుకోవాలి. ఎంత మందినో బైపాస్ సర్జరీకి పంపాను కానీ నా మనిషికి వచ్చేసరికి తట్టుకోలేకపోయాను.

"అమ్మా!" కొంచెం ఆదుర్దాగా, కొంచెం నిష్టూరంగా పిలిచింది అమూల్య.

"మన ఆరోగ్యం బాగుంటేనే కదా పేషంటుని బాగా చూసుకోగలుగుతాం. మిమ్మల్ని మీరు చూసుకోవట్లేదు.. డాక్టరైయుండీ అనను కానీ.." గ్లాసులో బత్తాయి రసం ఇస్తూ అంది.

నిజమే. ఈ రెండు నెలల్లో బాగా నీరసించి పోయాను.

"మాం! ఏంటి చిన్న పిల్లలా. డాడీకి ఏంఫరవాలే దన్నారు. యు షుడ్ టేక్ కార్ ఆఫ్ యుర్సెల్ఫ్.." ప్రశాంత్

కోపడ్డాడు. ఒక్కడే కొడుకని గారాబం ఎక్కువేం చేయలేదు మేము.. కానీ ఓదార్పు మాట కూడా కొట్టినట్టు చెప్పడం వాడి ప్రత్యేకత. నాకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నేను డాక్టరుగా పని చేసిన పల్లెలో చదువు సరిగ్గా లేదని వాణ్ణి పబ్లిక్ స్కూల్లో హాస్టల్లో ఉంచి చదివించడం. చదువు బాగా అబ్బింది కానీ వారం వారం ఇంటికొచ్చినా, "అమ్మా!" అనే పిలుపుకే మొహం వాచిపోయాను.

"మీకెందుకు.. కూతురు లేని లోటు నేను తీరుస్తా కదా!" అన్న అమూల్య వల్ల స్వాంతన పొందుతున్నాం ఇద్దరం.

"అదే నాజూగ్గా చెప్పచ్చు కదా.. మీద పడి కరవకపోతే.." మందలించింది అమూల్య.

"నాకింతకంటే రాదు." ప్రశాంత్ విసురుగా వెళ్ళిపోయాడు. బావకున్న విసుక్కి పదిరెట్లు వచ్చింది వీడికి. మనసులో ఎంత ప్రేమ, ఆప్యాయత ఉంటే ఏంలాభం? మనకి కనిపించదు కదా!

నెమ్మదిగా బావ ఆరోగ్యం మామూలు స్థితికి వచ్చింది.

"అమ్మా!" ఒక రోజు అమూల్య నా దగ్గరికి వచ్చి మెల్లిగా పిలిచింది.

"ప్రశాంత్ కి అమెరికాలో ప్రాజెక్ట్ వచ్చింది. వెళ్తానని పట్టు పడ్తునాడు. మీకు చెప్పటానికి మొహమాటంగా ఉంది. అంటే తనకి సరిగ్గా చెప్పడం రాదు కదా అని". నా కొడుకు గురించి చెడ్డగా అనుకుంటానేమోనని నట్టుతూ చెప్తున్న అమూల్యని చూస్తుంటే, నాకు నవ్వూ కోపం ఒక్క సారే వచ్చాయి.

కళ్ళలో కోపం చూపిస్తూ నవ్వుతూ అన్నాను, "ఎందుకూ ఇక్కడ లేవా ప్రాజెక్ట్?"

"లేవని కాదు.. కొత్త ఎక్స్పీరియన్స్ కదా అని. పైగా.."

"అందరూ వెళ్తునారుకదా.. తను కూడా ఏదో ఉద్ధరిద్దామని.." ఉక్రోషంగా పూర్తి చేశాను.

"అది కాదమ్మా!"

"ఏది కాదు.. రిటైరయ్యాక మామానాన మేముంటా మంటే బలవంత పెట్టి తీసుకొచ్చావు. అంతా బాగానే ఉంది కదా అనుకుని ఉన్నవన్నీ అమ్మేసుకున్నాం మేం. ఇప్పుడు మీకెంచక్కా రెక్కలు విప్పుకుని ఎగిరిపోతా మంటే.." ఏడుపుతో కంఠం పూడుకుపోయింది.

"నిజమే! కానీ రెండేళ్ళలో తిరిగి వచ్చేస్తాం. అట్లా అని కంపెనీ వాళ్ళే చెప్తున్నారు. ప్రశాంత్ సంగతి తెలుసు కదా. నేను ఎంత చెప్పినా వినటంలేదు. మీరు ఇక్కడ హాయిగా ఉండచ్చు. బాగా అలవాటైంది కదా!"

నాకు చిఱ్ఱెత్తుకొచ్చింది. "ఐతే అంతా నిర్ణయించు కుని మాకు తెలియపరుస్తున్నారా? కొంచెం ముందు తెలిసుంటే కనీసం ఇల్లైనా అమ్మకుండా ఉండే వాళ్ళం. ఎప్పుడు ప్రయాణం?"

"ప్రశాంత్ ఈ ఆదివారం ఫ్లైట్ కి వెళ్తున్నారు. మాకు పది రోజుల తరువాత. పోనీ నేనూ పిల్లలూ మానెయ్యమా? రెండేళ్ళు ఎంత లోకి గడిచిపోతాయి?" నాకేసి బెదురుగా చూస్తూ అంది అమూల్య.

ఎప్పుడూ దబాయిస్తున్నట్లుగా మాట్లాడే అమూల్య అంత బేలగా అడుగుతూంటే జాలేసింది. తనేంచేస్తుంది, మొగుడికీ మాకూ మధ్య నలిగిపోతోంది. అంత జబ్బు పడి లేచిన తండ్రినీ, ఎప్పుడూ ఇల్లూ, హాస్పిటలూ తప్ప ఎక్కడికీ వెళ్ళరుగని నన్నూ వదిలేసి వెళ్ళడానికి వాడికి మనసెలా ఒప్పిందో!

"అలా ఏం అఖ్ఖర్లేదులే. మళ్ళీ మిమ్మల్నిద్దఱినీ విడ దీసిన పాపం నాకెందుకు.. వెళ్ళి సామాన్లు సర్దుకోండి."

..........

"మాం! తప్పకుండా టూ ఇయర్స్‌లో వచ్చేస్తాం. నువ్వు నాన్నని చూసుకోగలవు. ఇక్కడ అన్ని అరేంజ్‌మెంట్స్ చేసివెళ్తాము కదా! పని వాళ్ళందరూ మమూలుగా వస్తూంటారు. రోజూ వెబ్‌కాంలో చూస్తూ పలకరిస్తూంటాం. ప్రామిస్." చాలా సౌమ్యంగా నా ప్రక్కన కూర్చుని అనునయించి వెళ్ళిపోయాడు ప్రశాంత్. అంతా ఒక వైపు నుంచే ఆలోచించి మాట్లాడే వాళ్ళతో ఏంచెప్తాం? చదువూ, పెళ్ళీ అవగానే వెళ్తే మేం కూడా అందర్లాగా సర్దుకునే వాళ్ళం. ఇన్నేళ్ళు మురిపించి బంధాలు పెంచుకున్నాక. అస్సలు తట్టుకోలేకపోయాను.

అమూల్యా పిల్లలూ కూడా వెళ్ళిపోయాక.. లంకంత ఫ్లాట్ బావురుమంటూంటే బావ బాగానే ఉన్నారు కానీ నేనే డిప్రెషన్ లోకి వెళ్ళిపోతున్నానేమో అనిపించింది. ఇద్దరు మనుషులకి ఏమవసరాలుంటాయి, ఏం పనుంటుంది. పని వాళ్ళు గంటలో పని ముగించుకుని వెళ్ళిపోతున్నారు.

బావ స్వతహాగా మితభాషి. సుడోకు పట్టుకు న్నాడంటే మిగిలిన ప్రపంచం ఏమైపోయినా అక్కర్లేదు.

ఆకలైనప్పుడు ఏదో కతకడం మిగిలిన సమయంలో పడుకోవడం. లేస్తే కాళ్ళూ కీళ్ళూ నొప్పులూ. అరవైలో ఎనభై లాగున్నాను. ప్రశాంత్ ఆఫీసులో పని చేసే

అతను వచ్చి ఇంటర్నెట్, వెబ్‌కాం అమర్చి వెళ్ళాడు. అతను మాట్లాడించినప్పుడు మాట్లాడి పిల్లల్ని చూశానంతే. తర్వాత బావ ఎంత బ్రతిమాలినా అమూల్య ప్రశాంత్ ఎన్ని సార్లు పిలిచినా కంప్యూటర్ జోలికి వెళ్ళలేదు.

నాకెందుకో కంప్యూటర్ చూస్తుంటే పిచ్చి కోపం వచ్చేస్తుంది. దాని వల్లనే కదూ పిల్లలు దూరమై పోయింది. ఎన్ని కబుర్లు చెప్పింది అమూల్య. సన్నగా కడుపులో మంట. గుండె రేసు గుఱ్ఱంలా పరుగెడు తున్నట్లు భావన. అన్యాయం జరిగిపోయిందన్న ఆవేదన.

కాంప్లెక్సులో ఎంతమందున్నా హాయ్, బై తప్పితే మూడో మాట మాట్లాడరు. అందరూ ప్రశాంత్ వయసు వాళ్ళు. వాళ్ళున్నప్పుడు వీకెండ్ పార్టీలూ అవి, వాళ్ళతో పాటు మేమూ. ఆ తరువాత రెండు మూడు సార్లు పిలిస్తే వెళ్ళాం కానీ మాకే ఎబ్బెట్టుగా అనిపించింది. అర్ధరాత్రి భోజనాలూ. గట్టి గట్టిగా గుండెలదిరేలా పాటలూ, మాటలూ, మాకర్ధంగాని కంప్యూటర్ భాషలో సంభాషణలూ! వెఱ్ఱి మొహాలేసుకుని చూడలేక మానేశాం. మరీ మంచిదనుకున్నారు కుఱ్ఱగాంగు. అలా జనం మధ్యలో ఒంటరి బ్రతుకు. కొంత కాలానికి నాకూ ఇంట్లో సోఫాకీ తేడా తెలీకుండా పోతుందను కున్నారేమో, బావ మా క్లాస్ మేట్ గౌరిని ఫోన్ జేసి పిలిచారు. తను సైకియాట్రిస్టు వస్తూనే బొకేతో బాటు చీవాట్లు కూడా తీసుకొచ్చింది.

"సీతా! ఇలా ఐపోయావేంటి! నాకు ఒక్క ఫోను చెయ్యలేకపోయావా? అందుకే అంటారు చదువుకున్న వాడికంటే చాకలాడు మేలని. అన్నేళ్ళు చదివిన చదువేమైంది? ఈ ఊళ్ళో నువ్వు కూడా ఎంతో మందికి కౌన్సిలింగ్ చేసుంటావు కదా!" ఆపకుండా అరగంట వాయించి, వెళ్తూ వెళ్తూ రోజూ తన క్లినిక్కి పొద్దున్న, సాయంత్రం రెండేసి గంటలు రమ్మంది.

"నాకూ వయసుతో పాటు పేషంట్స్ ఎక్కువై పోతున్నారు. కాస్త అసిస్ట్ చేద్దువు గాని. తప్పకుండా రా! రేపట్నించి కారు పంపిస్తాను"

"అక్కర్లేదు గౌరీ! మా డ్రైవర్ ఉత్తినే జీతం తీసుకుంటున్నాడు. నేనే వస్తాలే" కుంటుకుంటూ లేచి సాగనంపాను. అప్పట్నించీ కాస్త మనుషుల్లో పడ్డాను. గౌరి దగ్గరకొచ్చే పేషంట్స్‌ని చూస్తుంటే వాళ్ళ సమస్యల్ని వింటుంటే నాకు జరిగిందనుకుంటున్న అన్యాయం ఎంత చిన్నదో అర్ధమైంది. పుట్టిన ఇద్దరూ డౌన్ సింద్రోం (మానసికంగా భౌతికంగా ఎదగలేని పిల్లలైతే పరిస్థితులు ఎదుర్కోడానికి కౌన్సిలింగ్‌కి వచ్చిందొక మాతృమూర్తి. దగ్గఱ దగ్గఱ ఇరవై సంవత్సరాల నుంచీ, భర్త అంతా తన తప్పే ఐనట్లు ప్రవర్తిస్తుంటే, ఒంటరిగా దేముడితో పోరాడి అలసి పోయింది. ఇద్దరూ మొగ పిల్లలవటం కొంత నయమే. కానీ బలం పెరిగి ఒక్కో సారి వాళ్ళు చేసే చేష్టలు అడ్డుకోలేక నిస్త్రాణతో పడిపోతుంది. డబ్బుకి లోటు లేదు కనుక బలమైన మేల్ నర్సుని పంపించి, ఆవిడకి బలానికి మందులిచ్చి, కొంత వేదాంతం బోధించి పంపించాం.

అప్పట్లో ఇంకా ఏమ్నియో సింథసిస్ పరీక్షలు ప్రాముఖ్యం వహించలేదు. ఇప్పుడైతే నెల తప్పగానే క్రోమోజోం పరీక్షల్లో తెలిసిపోతోంది. వెంటనే టెర్మినేట్ చేసేస్తున్నారు.

ఇంకో పేషంటు. ముగ్గురు పిల్లల్ని వదిలి భర్త వేరే అందమైన పిల్లతో వెళ్ళిపోతే దిక్కు తోచక, పిచ్చెక్కినంత పనై, పిల్లల కోసం మనసుని అదుపులో పెట్టుకోవాలని. పెట్టుకోలేక క్షోభతో వచ్చిన నడి వయసు అబల. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. తనని వుమెన్స్ ప్రొటెక్షన్ సెల్‌కి పంపి కాంపెన్సేషన్‌గా భర్త జీతంలో సగం వచ్చేలాగా చేసి, మాకు తెలిసిన హాస్పిటల్లో రిసెప్షనిస్టుగా వేయించాం.

అలా ఎన్ని గాధలో. మా దగ్గఱికి ఎక్కువ ఆడ పేషంట్సు వస్తారు. అందుకనే మొగవాళ్ళ కష్టాలు తెలియవు మాకు. వాళ్ళవి ఇంకా విచిత్రమైన ప్రాబ్లమ్సని చెప్తారు మా మంత్లీ డాక్టర్స్ మీటింగ్స్‌లో.

గౌరి చెప్పినట్లు ఆరునెలల్లో బాగా కోలుకున్నాను. కానీ మనసులో గాయం అలానే ఉండిపోయింది. ఎంత సర్ది చెప్పుకున్నా, బావ ఎన్ని సార్లు పిలిచినా కంప్యూటర్ దగ్గఱికి మాత్రం వెళ్ళ లేదు. వారానికోసారి ఫోన్లో ముక్తసరిగా మాట్లాడుతున్నాను. అదీ తప్పనిసరిగా. అమూల్య పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నిస్తూనే ఉంది.

........

"అమ్మా! ఏంటిది?" కన్నీళ్ళతో తన భుజం తడిపేస్తున్న నన్ను మెల్లిగా సోఫా దగ్గఱికి నడిపించి తీసుకెళ్ళి కూర్చోపెట్టింది అమూల్య. వెక్కుతున్న నన్ను చూసి బుజ్జిగాడు బిత్తర పోయాడు. పాప వాళ్ళమ్మ ఒళ్ళో దూరి పోయి మమ్మల్నిద్దఱినీ వింతగా చూస్తోంది.

"మాం! మేం వచ్చేశాం కదా. ఇంక ఎక్కడికీ వెళ్ళం.

నిజం. మదర్ ప్రామిస్". ప్రశాంత్ నా కాళ్ళ దగ్గర కూర్చుని నా మోకాళ్ళ మీద తల ఆన్చాడు.

"అమ్మా! మీరిచ్చిన షాక్ ట్రీట్మెంట్ బాగా పని జేసింది. ప్రశాంత్ చాలా మారాడు. ఎంత సౌమ్యం. శాంతం వచ్చాయో మీకే చూస్తారుగా! అమెరికాలో అన్ని పనులూ మేమే చేసుకోవలసి రావడం, ఎవరూ పాంపర్ చేసే వాళ్ళు లేకపోవడం కొంత కారణమైతే. ఈ రెండేళ్ళూ మీరు మమ్మల్ని దూరంగా ఉంచడం" మాట రానట్లు ఆగిపోయింది అమూల్య.

"మమ్మల్ని ఎంత సతాయించావో అంతకి పది రెట్లు నువ్వు బాధ పడి ఉంటావని నాకు తెలుసమ్మా! అందుకే అమెరికా నుంచి నీకు మంచి గిఫ్టు తెచ్చాం. చూశావు కదా! ఈ సారి ట్విన్స్. నీ పేరూ, నాన్నగారి పేరూ నిర్ణయించేశాం." నిర్ణయం అని వత్తి పలుకుతూ అన్నాడు ప్రశాంత్ నవ్వుతూ.

భారంగా సోఫా లోంచి లేచి వంటింట్లోకి వెళ్తున్న అమూల్యని చూసి కళ్ళ నిండా నీళ్ళతో నవ్వాను.

"అమ్మదొంగా! ఇవాళ వీళ్ళు వస్తున్నట్లు మీకు తెలుసు కదా!" రాత్రి బావ ప్రక్కన పడుక్కుని నిష్టూరంగా అన్నాను.

"నువ్వు వాళ్ళ గురించి ఏంచెప్పబోయినా వినట్లేదు కదా. ఏంచెయ్యను. ఇప్పుడు తృప్తిగా ఉందా నీకు. ఐనా నీ కళ్ళలో ఏదో సందేహం, సంకోచం కనిపిస్తున్నాయి" నా మొహంలోకి చూస్తూ అన్నారు.

"అదే అమూల్య గురించి. అమెరికా నుంచి" ఆపేశాను, బావ వడిలోకి ముడుచుకు పోతూ.

"ఊ! అమెరికా నుంచి".

"అంటే. నేను ఇన్నాళ్ళూ అందరినీ ఫామిలీ ప్లానింగు చేయమని, అందరికీ ఆపరేషన్లు చేయించి. ఇప్పుడు నా పిల్లలే."

"అదా? పరవాలేదులే. అంత గిల్టీగా ఫీలైపోక్కర్లేదు. నువ్వు ఒక్కణ్ణే కని ఆదర్శమయ్యావు కదా" బావ పకపకా నవ్వుతూ నా నుదురు చుంబించారు.

*******


# DAKSHIN INDIAN CUISINE

***Bar& Banquet** Finest Indian Cuisine...*

***675 Route 1 South& Gill Lane, Iselin, NJ, 08830.Tel: 732-750-9292 Fax: 732-750-9262***

## BAR&BANQUET

*Dance, Drink, Talk, Eat, Sing, and have fun, only at... .***DAKSHIN***Finest Indian Cuisine... Experience the Magical & Romantic Evening with excellent North Indian, south Indian& indo-Chinese food.*

## GRAND LUNCH BUFFET

*Come and Enjoy our seven day lunch buffet with friends, collogues and your family.*
*Buffet includes north Indian, south Indian and indo-Chinese food.*

## BANQUET & CATERING

*Specialized in Andhra food, for catering services visit our web sites*
*www.dakshinusa.com, www.dakshinexpress.com*
*E-mail at contactus@dakshinusa.com or call 732-750-9292*
*Enjoy our south Indian special dosa party at your place or at our place.*

**Visit our other Dakshin locations at your convenience.**

| Dakshn Express | Dakshin |
|---|---|
| Dosa& Biryani House | At Desi Galaxy |
| 1689 Oak tree road | 1396 Oak tree road |
| Edison, NJ 08820 | Iselin, NJ 08830 |

*PH No: 732-494-6363*

***Don't miss our famous biryani's & Chilli Chicken .... So call 732-494-6363***